ANDHRAJYOTHY
# ఆంధ్రజ్యోతి

కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025 | 5


బాలచంద్రుడి వేషధారణలో మంత్రి దుర్గేష్


చంద్రబాబుతో యనమల కరచాలనం

ఆదేశా.. కబడ్డీ

మద్దతుగా మన మహిళా నేతలు

## హై..హై..నాయకా!

కూటమి నాయకులను ఒక వైపే చూశాం.. రెండో వైపు చూడలేదు.. గత మూడు రోజులుగా అదీ చూపించారు. అమరావతి కేంద్రంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనల్లోనూ తమ సత్తా చాటారు. బుధవారం కబడ్డీ పోటీల్లో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నువ్వా నేనా అంటూ తలపడ్డారు. 60 ఏళ్లు పైబడిన కేటగిరీలో వంద మీటర్ల విభాగంలో తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. గురువారం పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ బాలచంద్రుడి ఏకపాత్రాభినయంలో ద్వితీయ బహుమతి కొట్టేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మ్యూజికల్ చైర్స్‌లో ప్రథమ బహుమతి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కేరమ్స్‌లో ప్రథమ బహుమతి, టెన్నికాయిట్ డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచింది.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:23 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:45 (శనివారం ఉదయం)


## హలీమ్.. సలాం!

చూస్తే నోరూరుతోంది.. ఏడాదికి ఒక్కసారైనా తినాలనిపిస్తుంది.. ఎందుకంటే ముస్లింల వంటకం మరి.. ఆరోగ్యం.. బలమైన ఆహారం.. రంజాన్ మాసం సందర్భంగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నగరాల్లో జనం ముందుకు వచ్చేసింది.. జనం కూడా ఎగబడుతున్నారు.. 15 రకాల మసాలాలతో తయారు చేసే హలీమ్‌కు సలామ్ కొడుతున్నారు..

6

## మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

- అసెంబ్లీలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు ప్రస్తావన



కాకినాడ సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలవల్ల నష్టపోతున్న మత్స్యకారుల మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అసెంబ్లీలో ప్రస్తావించారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో ఈ విషయమై ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా పరిధిలో సముద్రంలో చేపల వేట చేసే మెకనైజ్డ్ బోట్లు 395, మోటరైజ్డ్ బోట్లు 3,694 ఉన్నాయని తెలిపారు. ఇటీవలకాలంలో సముద్రంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలవల్ల, అగ్నిప్రమాదాలవల్ల కొన్నిబోట్లు పూర్తిగా పాడైపోయాయన్నారు. దీనివల్ల బోట్ల యజమానులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారన్నారు. ఈ పరిస్థితి నుంచి మత్స్యకారులను ఆదుకునేందుకు ఒకసమగ్రమైన ఇన్సూరెన్స్ పాలసీ తీసుకురావాలన్నారు. పాండిచ్చేరి ప్రభుత్వం జీవో నెంబర్ 15 ద్వారా మత్స్యకార బోట్లకు ఇన్సూరెన్స్ పథకం అమలు చేస్తోందన్నారు. దీనివల్ల బోటు యజమానులకు ఆర్థికపరమైన భద్రత కలుగుతోందన్నారు. అందువల్ల ఈ ఇన్సూరెన్స్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని యాంత్రిక పడవలకు వర్తింపజేయడానికిగల అవకాశాలను పరిశీలించాలన్నారు. తద్వారా కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా రాష్ట్రంలోని బోట్లకు ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

## కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీతో పాటు అవసరమైనచోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్ఠం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులనుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు వంటి అంశాలపై చర్యలను భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. 18-19వయసుగల యువత ఓటు నమోదు వంటి అంశాలపై తమ సూచనలు, సలహాలు అందించాలన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 పోలింగ్‌కేంద్రాల్లో 16లక్షల 36,916మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో 1000-1200 మంది ఓటర్లు, 586 పోలింగ్ కేంద్రాల్లోను, 1200పైన ఓటర్లు 279 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 800-1200 మంది ఓటర్ల ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభాజించనున్నామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు కిలోమీటర్లకు మించి పోలింగ్ కేంద్రం ఓటర్లకు దూరంగా ఉండకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో వెంకట్రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగంఅధికారి జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు సాయిబాబా, అప్పారావు, జయప్రకాష్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

# తిన్నది కక్కేనా?





- కిర్లంపూడి సహకార సొసైటీలో రూ.104కోట్ల అవినీతి వ్యవహారం
- అక్రమాలకు పాల్పడ్డ వారిలో అయిదుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ
- తిన్న డబ్బులు కక్కాలంటూ నోటీసుల ద్వారా కోరిన డీఆర్ కోర్టు
- ఆస్తుల వేలం ముప్పు నుంచి తప్పించుకునేందుకు మరికొందరు న్యాయస్థానానికి..
- ఇప్పటికే కొట్టేసిన కోట్ల కొద్దీ డబ్బుతో కొన్న ఆస్తులన్నీ వేరే పేర్లపై బదిలీ చేసేసిన నిందితులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కిర్లంపూడి సొసైటీలో రూ.104కోట్ల అవినీతి మేతపై బాధ్యులకు క్రమేపీ ఉచ్చు బిగుస్తోంది. రాజకీయ పలుకుబడితో ఈ కుంభకోణం ముందుకు కదలకుండా అడ్డుకున్నా 2024లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్కాం ఎట్టకేలకు బయటపడింది. ఈనేపథ్యంలో అక్రమార్కులుగా గుర్తించిన కొందరికి ఎట్టకేలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. అయిదుగురు ఉద్యోగులు తిన్నది ఎందుకు కక్కకూడదో తెలపాలంటూ వారికి సహకారశాఖ జిల్లా డీఆర్ కోర్టు షోకాజ్ నోటీసులు పంపింది. సమాధానం రాకపోతే ఆస్తుల రికవరీకి సైతం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరికొందరు అక్రమార్కులు చనిపోగా, వారిఆస్తులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉండడంతో వారి కుటుంబీకులు తాజాగా న్యాయస్థానం మెట్లెక్కి రక్షణ పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈనేపథ్యంలో అంతా కలిపి మెక్కేసిన రూ.104కోట్లలో అసలు రికవరీ పాతికశాతం అయినా సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### తప్పించుకుందామనుకున్నా కుదర్లేదు..

కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతుల అభివృద్ధికి ఇవ్వాల్సిన రుణాలను కొందరు అధికారులు అడ్డంగా దారి మళ్లించేశారు. లేని రైతులు, చనిపోయిన అన్నదాతలు, కొండలు, గుట్టలు, కాలువల పేర్లతో దొంగచాటుగా రుణాలు మంజూరు చేసి సొసైటీ నిధులను కోట్లలో దారిమళ్లించేశారు. 2014 నుంచి 2024వరకు సొసైటీ కీలక అధికారితో సహా మరికొందరు ఓ నేత, ఆయన అనుచరులతో కుమ్మక్కై భారీగా దోచేశారు. ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతోన్న ఆ కీలకనేత దీనివెనుక భారీగా చక్రం తిప్పారు. ఇందులో జరిగిన కోట్ల కొద్దీ అవినీతి బయటకువస్తే అంతా మునిగిపోతామనే కారణంతో తనకున్న అధికార పలుకుబడితో సదరు నేత ఈ కుంభకోణంపై దర్యాప్తు జరగకుండా చేయగలిగారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు సదరు అక్రమార్కుల అవినీతి పండింది. సొసైటీలో అవినీతిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించగా పూర్తిస్థాయి విచారణ జరిపిన పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి పద్మ గతేడాది డిసెంబరు 28న జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణకు పూర్తిస్థాయి నివేదిక అందించారు. కుంభకోణం ఆధారాలు, అవినీతి జరిగిన తీరును నివేదికలో కూలంకుషంగా వివరించారు. సొసైటీ సీఈవోలు, మేనేజర్లు, సూపర్‌వైజర్లు అంతా కలిపి దొంగ రుణాలనుంచి జీతాలు, బకాయిలు, ఎరువుల కొనుగోలు పేరుతో రూ.104 కోట్లు అవినీతికి పాల్పడ్డారని నివేదికలో గుర్తించారు. సీజనల్ వ్యవసాయ కార్యకలాపాల నిర్వహణకు రైతులకు ఇచ్చే స్వల్పకాలిక రీఫైనాన్స్ (ఎస్‌టీ, ఎస్‌ఏవో)లోన్ల పేరుతో ఒకసారి రూ.13.89కోట్లు, మరోసారి రూ.42కోట్లు, ఇంకోసారి రూ.24.33కోట్లు, ఇంకా దఫదఫాలుగా ఇంకో రూ.18కోట్ల వరకు మొత్తం రూ.80కోట్ల వరకు మింగేశారని విచారణలో తేలింది. దీనికి సొసైటీ మాజీ సీఈవో కె.రాజబాబు, మాజీ అధ్యక్షుడు ఏవీవీఎస్ఎన్ మూర్తి,సూపర్‌వైజర్ జేవీ మోహనరావు, మాజీ మేనేజర్ పి.మురళీకృష్ణ, సూపర్‌వైజర్ ఎం.నరసింహమూర్తి, మాజీ అధ్యక్షురాలు సూర్యకుమారి, ఇంకా మరో 12మంది ఉద్యోగులు ఈ కుంభకోణానికి బాధ్యులుగా తేల్చారు. షేర్ క్యాపిటల్ కొరత, నకిలీ డీడీల రిఫండ్ పేరుతో రూ.7.90కోట్లు, జీతాల బకాయిల మంజూరు పేరుతో రూ.60.72లక్షలు, ఎరువుల వ్యాపారం పేరుతో మాజీ సీఈవో రాజబాబు ఒక్కరే రూ.1.18కోట్లు తినేశారు. దీర్ఘ కాలిక రుణాలపేరుతో రూ.1.50కోట్లు, తాత్కాలిక డిపాజిట్లు, క్యాష్‌బుక్‌లోకి నగదు వసూలు లెక్కలు ఎక్కించకుండా, నకిలీ రశీదులతో నగదు వసూళ్లు వంటివి కలిపి మొత్తం రూ.104కోట్లు మింగేసినట్లు నివేదికలో గుర్తించారు. ఎవరెవరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలనేది నివేదికలో వివరించారు. జీతాల బకాయిల పేరుతో అడ్డగోలుగా డ్రాచేసిన రూ.60.72లక్షలను 14మంది ఉద్యోగులనుంచి రికవరీ చేయాలని, మాజీ సీఈవో రాజబాబుపై చర్యలు చేపట్టాలని సిఫార్సు చేశారు. అక్రమాలకు సంబంధించి కిర్లంపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు సూర్యకుమారి, రాజకుమార్, డీసీసీబీ ప్రత్తిపాడు బ్రాంచ్ మాజీ మేనేజర్లు మురళీకృష్ణ, వైవీఎస్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు ప్రసాద్, మోహనరావు, నరసింహమూర్తిలపై చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

### నోటీసులతో తొలి షాక్..

నివేదికలో పేర్కొన్న ప్రకారం రూ.104కోట్ల అవినీతిపై ఇటీవల కిర్లంపూడిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో చర్చ జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ నేపథ్యంలో ఈ తీర్మానం ఆధారంగా సహకారశాఖలో డీఆర్ న్యాయస్థానంలో గతనెలలో అధికారులు కేసు దాఖలు చేశారు. గుర్తించిన అవినీతి తిమింగలాలకు నోటీసులు జారీచేసి క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వీలుగా న్యాయస్థానం ఆదేశాలు కోరారు. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించిన డీఆర్ కోర్టు రూ.104కోట్లు మెక్కేసిన బాధ్యులకు సంబంధించి ఆయా అంశాల ఆధారంగా అక్రమార్కులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీచేయడం మొదలుపెట్టింది. అందులో భాగంగా ఐదుగురు ఉద్యోగులు సొసైటీలో ఏయే అంశాల్లో కోట్లలో డబ్బులు మెక్కేశారో గుర్తించి వారికి ఇటీవల నోటీసులను డీఆర్ కోర్టు జారీ చేసింది. తిన్న డబ్బంతా ఎందుకు కక్కించకూడదో వివరణ కోరుతూ నోటీసుల్లో ప్రస్తావించింది. దీనిపై సదరు ఉద్యోగులు ఇచ్చిన సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనుంది. ఈ కుంభకోణానికి సంబంధించి సింహభాగం నిధులు మెక్కేసిన ఓ కీలక అధికారి, మరికొందరు మేనేజర్లు ఇప్పటికే చనిపోయిన నేపథ్యంలో వారి కుటుంబీకుల నుంచి ఆస్తుల స్వాధీనానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇది చట్ట విరుద్ధమని పేర్కొంటూ తమ జోలికి రాకుండా ఆదేశించాలని కోరుతూ ఇటీవల ఇద్దరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారంలో ప్రస్తుతం స్టే కొనసాగుతోంది. దీనిపై ప్రభుత్వం తరఫున అధికారులు పిటిషన్ వేయనున్నారు. రూ.104కోట్ల అవినీతిలో మొత్తం 12మందివరకు ఉద్యోగులు, బయటి వ్యక్తులను బాధ్యులను గుర్తించినా వీరిలో నలుగురు నిందితుల ఆస్తులను మాత్రమే గుర్తించారు. మిగిలిన వారి వివరాలు ఇంకా లభ్యం కాలేదు. వారేమో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సహకార సొసైటీల్లో కోట్లలో జరుగుతోన్న అవినీతిపై ఇటీవల సోమవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. గతవైసీపీ హయాంలో అనేక సొసైటీలు కోట్ల లో నిధులు మింగేశాయని, నివేదికలు అందా యని, వాటిపై 1964 ఏపీసీఎస్ చట్టం ప్రకారం చర్యలకు ఉపక్రమిస్తామని ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పాఠశాలవిద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా పరిషత్, మండలపరిషత్, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల కింద పనిచేస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను deoeg.org వెబ్‌సైట్, నోటీస్ బోర్డుల్లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో రమేష్ తెలిపారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు కలిగిఉంటే శుక్రవారంనుంచి ఈనెల 26లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. నిర్ణీత గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోబోరన్నారు.

## పాస్టర్లకు గౌరవ వేతనం కొనసాగిస్తూ జీవో జారీ

కాకినాడసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు గౌరవవేతనం పథకాన్ని కొనసాగిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు గురువారం మైనారిటీ సంక్షేమ శాఖద్వారా జీవోనెంబర్ 30 జారీ చేశారు. క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్లకు గౌరవ వేతనం పథకాన్ని పునరుద్ధరిస్తూ అవసరమైన త్రైమాసిక నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడజిల్లాఅధ్యక్షుడు మోసా అబ్రహం హర్షం వ్యక్తం చేశారు.

# భారీగా పేరుకుపోయాయి



- రూ.15కోట్ల 50లక్షల ఉపాధి హామీ బకాయిలు
- రెండునెలలుగా చెల్లింపులకు ఇబ్బందులు
- నిధులు విడుదల చేయాలని కూలీల డిమాండ్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి జిల్లాలో బకాయిలు పేరుకుపోయాయి. రెండునెలలుగా విడుదల కోసం కూలీల ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 20 మండలాల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2024-25సంవత్సరానికి 69లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 30వేలమంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వీరికి రూ.15కోట్ల 50లక్షల ఉపాధి హామీ బకాయిలు పేరుకుపోయాయి. గ్రామాల్లో చెరువుల్లో పూడికతీత, పుంతదారులు, ఇంకుడు గుంతలు తవ్వడం, ఉద్యానపంటల అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. మెట్టలో పెద్దఎత్తున ఇంకుడు గుంతలను తవ్వుతున్నారు. వేసవిలో సాగు చేసే పంటలకు నీటిఎద్దడి లేకుండా ఉండాలనే లక్ష్యంతో భూగర్భజలాల శాతాన్ని పెంచాలనే కృతనిశ్చయంతో అధికార యంత్రాంగం ఉంది.

### వేసవిలో ముమ్మరంగా..

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి పనులు ఉదయం 6గంటలకు ప్రారంభించి 11గంటల వరకు నిర్వహిస్తున్నారు. రోజుకు రూ.300 కూలీ ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ వేసవిలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జూన్‌నెల వస్తే వానలు మొదలై ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ముమ్మరంగా పనులు చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు.

### ఇప్పటివరకు 2,30,356 మందికి పని

పేరుకుపోయిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేస్తున్నారు. చేసిన కూలీ పనికి సకాలంలో సొమ్ములు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఈఏడాదిలో ఇప్పటివరకు 2,30,356మందికి పని కల్పించగా రూ.173కోట్లు చెల్లించారు. ఇప్పటివరకు కల్పించిన పనిదినాల్లో కాకినాడ జిల్లాకు రూ.112కోట్ల మేరకు మెటీరియల్ కాంపొనెంట్ సమకూరింది. దీని ద్వారా పల్లె పండుగలో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. కుటుంబాల సంఖ్య ప్రకారం వివరాలు తీసుకుంటే జిల్లాలో 2,86,589 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిని పెంచేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

### వారం రోజుల్లో విడుదల: డ్వామా పీడీ

మరోవారంరోజుల్లో నిధులు విడుదలవుతాయని భావిస్తున్నాం. పెండింగ్ బకాయిల వివరాలు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఉపాధికూలీల బకాయిలను చెల్లిస్తాం. జిల్లాలో నీటిగుంతల తవ్వకం ముమ్మరంగా నిర్వహిస్తున్నాం. నీటిగుంతలవల్ల భూగర్భ జలాల శాతం పెరుగుతుంది.

## ఈవీఎంల భద్రతకు పటిష్ఠ చర్యలు

- కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఈవీఎం గోదామును రెవెన్యూ,ఎన్నికలు, అగ్నిమాపక, పోలీస్‌శాఖల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ వీవీప్యాట్స్ భద్రతకు పటిష్ఠచర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, ఎన్నికల, అగ్నిమాపక శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ప్రతినెల ఈవీఎంల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేష్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ జగన్నాథం, రాజకీయపార్టీల ప్రతినిధులు సాయిబాబా, అప్పారావు,జయప్రకాష్ పాల్గొన్నారు.



## మహిళల ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

- నేర సమీక్షలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ


హాజరైన పోలీస్ అధికారులు

కాకినాడ క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు ఇచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యాన్నిచ్చి తక్షణమే స్పందించాలని ఎస్పీ జి.బిందుమాధవ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశమందిరంలో జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్‌అధికారులతో గురువారం ఆయన నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులపట్ల అక్కడ సిబ్బంది, అధికారులు మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యను సాధ్యమైనంత త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మహిళలరక్షణకు ఏర్పాటు చేసిన శక్తి యాప్‌ను మహిళలు, బాలికలకు అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్‌ల్లో డౌన్‌లోడ్ చేయించాలన్నారు. రాత్రి పూట గస్తీలు పటిష్ఠంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ ఐజీ బి.రాజకుమారి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా పాల్గొన్నారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.





## సంధ్య వేళ.. సొగసుల విందు!

ఆకాశమే ఓ అద్భుతం. వానకురిస్తే, మెరుపు మెరిస్తే, హరివిల్లు కనిపిస్తే ఓ అందం. ఉదయమో అందం.. సంధ్య వేళో అందం. రాత్రికి ఆకాశమే ఓ అపురూప దృశ్యం. యానాంలో గౌతమీ గోదావరి తీరాన, యానాం- ఎదుర్లంక వారిధిపైన గురువారం సాయంత్రం కనిపించిన దృశ్యాలివి.... యానాం (ఆంధ్రజ్యోతి)

# హలీమ్‌కు సలాం!



### రంజాన్ మాసంలో హలీమ్ ఘుమఘుమలు

### హలీమ్ కోసం క్యూకడుతున్న మాంసాహారప్రియులు



కార్పొరేషన్ (కాకినాడ)/అమలాపురం టౌన్/ కల్చరల్ (రాజమహేంద్రవరం) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం వచ్చిందంటే.. నోరూరించే రంజాన్ రుచులు అందుబాటులోకి వస్తాయి.. భగభగమండే బట్టీలు, గరంగరం హలీమ్‌తోపాటు నోరూరించే తియ్యని ఖీర్, ఖుర్బానీ మిఠాయి రుచులు రంజాన్ మాసంలో భిన్న పంటకాలు దర్శనమిస్తాయి. మసాలా వాసనలు గుప్పుమంటుంటే ఆటు వైపుగా వెళ్లున్న భోజనప్రియులను అమితంగా ఆకర్షిస్తాయి. కాకినాడ జిల్లాలో తుని, పెద్దాపురం, పిఠాపురం తదితర ప్రాంతాల్లో ఈ హలీమ్ బట్టీలు దర్శనమిస్తున్నాయి. కాకినాడలో భారీ స్థాయిలో హలీమ్ అమ్మకాలు జరుగుతుండడంతో జిల్లా నలుమూలల నుంచి కాకినాడ వచ్చి హలీమ్ రుచి చూడడంతోపాటు కుటుంబ సభ్యులకు, మిత్రులకు పార్శిళ్లు తీసుకెళుతున్నారు. గతంతో పోలిస్తే కాకినాడ నగరంలో నాగమల్లితోట జంక్షన్, జేఎన్టీయూ, భానుగుడి సెంటర్, మసీదు సెంటర్, జగన్నాథపురం వంటి సెంటర్లతోపాటు సుమారు 10 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేసి అమ్ముతుండగా, కొన్ని రెస్టారెంట్లలో హలీమ్ తయారు చేసి అమ్ముతున్నారు. రంజాన్ మాసం ప్రారంభమయ్యాక హలీమ్ సందడి మొదలవుతుంది. షమీతుక్డా, కద్దుకా ఖీర్ స్వీట్స్‌పాటు మటన్, చికెన్ బిర్యానీ, కిమా సమోసా తదితర వంటకాలు నోరూరిస్తాయి. హలీమ్‌ను మటన్, చికెన్‌తో తయారుచేస్తారు. కాకినాడలో మటన్ హలీమ్ ఫ్యామిలీ ప్యాక్ రూ.400, చికెన్ ఫ్యామిలీ ప్యాక్ రూ.300కు బాగా అమ్ముతున్నారు. ముస్లింలు అధికంగా ఫ్యామిలీ ప్యాక్‌లే తీసుకెళుతున్నారు. ఒక్కో బట్టీ వద్ద రోజుకు సుమారు 150 నుంచి 200 వరకు ఫ్యామిలీ ప్యాక్‌లు ఆర్డర్లుగా అమ్ముడుపోతుండగా, బట్టీల వద్ద రోజుకు సుమారు రెండు వందల మందికి పైగా ఈ వంటకాలు తింటున్నారు. వేకువజామున చేపట్టే ఉపవాస దీక్ష సాయంత్రం విరమించిన అనంతరం ముస్లింలు ఆహారం తీసుకుంటారు. గోధుమ రవ్వ, 15 రకాల మసాలాలతో నోరూరించే విధంగా హలీమ్ తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఆజాద్ చౌక్ సెంటర్ హలీమ్ విక్రయాలకు అడ్డాగా ఉంది. వందలాది మంది ఇక్కడకు వచ్చి హలీమ్ కొనుగోలు చేస్తున్నారు. ఈ దుకాణాలు రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి. అమలాపురంలో టౌన్ బ్యాంకు వద్ద హలీం సెంటర్ ఏర్పాటుచేశారు.

#### ఆరోగ్యకరం హలీమ్



హలీమ్ వంటకాన్ని ఇరానీ తరహాలో తయారుచేస్తున్నాం. ఈ వంటకంలో జీడిపప్పు, పిస్తా, శనగపప్పు, మినపప్పు, గోధుమలతోపాటు మటన్, నెయ్యి, పంచదార వంటి ఆరోగ్యకరమైన అధిక ప్రోటీన్లు ఉండే వాటిని వినియోగిస్తున్నాం. ఉదయం 8 గంటలకు హలీం తయారీ ప్రారంభిస్తే సాయంత్రానికి అందుబాటులోకి వస్తుంది. కేవలం నాన్‌వెజ్‌లోనే మటన్ మీట్‌తో హలీంను తయారుచేస్తున్నాం. సింగిల్‌ప్యాక్ రూ.150 కాగా, ఫుల్ ప్యాక్ ధర రూ.200, ఫ్యామిలీ ప్యాక్ రూ.500కు విక్రయిస్తున్నాం. అన్నివర్గాల వారిని హలీమ్ వంటకం ఆకట్టుకుంటోంది.

- మహ్మద్ ఆషిక్‌అలీ (మున్నా), హలీమ్ సెంటర్ నిర్వాహకుడు, అమలాపురం

### ఉపవాస దీక్షలో డ్రై ఫ్రూట్స్, పండ్లకు ప్రాధాన్యం

రంజాన్ నెలలో ముస్లింలంతా కఠినమైన ఉపవాస దీక్షలు చేస్తారు. పగలంతా దాహాన్ని కూడా దరికి రానివ్వరు. ఆకలికి చోటివ్వరు. ఆహారపు అలవాట్లలో ప్రత్యేకత చూపిస్తారు. ఈ నెల రోజులు డ్రైఫ్రూట్స్, పళ్లు తీసుకుంటారు. రంజాన్ ఉపవాసదీక్షలు, నమాజ్ ఆధ్యాత్మిక చింతనలతోపాటు ఆరోగ్యానందించి ముస్లింల జీవనాన్ని ఆనందమయం చేస్తాయి. సహరి, ఇఫ్తార్ సమయాల్లో తీసుకునే ఆహారం రోగనిరోధక శక్తి పెంపొందిస్తుంది. మంచి శక్తిని కూడా అందిస్తుంది. దీని ద్వారా ఉపవాస దీక్ష చేస్తున్న వారికి ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. ఉపవాసం ఉండేవారు తెల్లవారుజామునే అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, పాలు, గోధుమ రుచులు, పెరుగు, మంచినీరు తీసుకుంటారు. డ్రైఫ్రూట్స్ కూడా భుజిస్తారు.



#### డ్రైఫ్రూట్స్ ప్రయోజనాలు

వంద గ్రాముల జీడిపప్పుతో 596 కేలరీల శక్తినిస్తుంది. బాదంలో 250 కేలరీల శక్తి, 49 శాతం ప్రోటీన్లు ఉంటాయి. ఒక శాతం ఐరన్ లభిస్తుంది. పిస్తాలో 557 కేలరీల శక్తి, 27 గ్రాములు కార్బోహైడ్రేట్స్, 200 గ్రాముల ప్రోటీన్లు లభిస్తాయి. క్రిస్మిస్‌లో 290 కేలరీల శక్తి, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ద్రాక్ష పండ్ల ద్వారా 71 కేలరీల శక్తి లభిస్తుంది. 20 మిల్లీగ్రాముల కాల్షియం, 2.9గ్రాముల పీచు పదార్థం, 15 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది.

#### ఖర్జూరం ప్రధానం

ముస్లింలు ఖర్జూరాన్ని అధికంగా తీసుకుంటారు. వంద గ్రాముల ఖర్జూరంలో 234 కేలరీల శక్తి, 55 మిల్లీగ్రాముల కార్బోహైడ్రేట్లు, 18 మిల్లీగ్రాముల ప్రోటీన్లు, 76 మిల్లీగ్రాముల పీచు పదార్థాలు, 4 మిల్లీగ్రాముల సోడియం, 60.9 మిల్లీగ్రాముల పొటాషియం, ఐరన్, విటమిన్-బి పుష్కలంగా ఉంటాయి. ధర కిలో రూ.120 నుంచి రూ.180 వరకు ఉంది.

#### ఖీర్, ఖుర్బానీ మిఠాయి ఆహా..

రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా చేసేది పాయసం. దీనిలో ఎక్కువగా డ్రైఫ్రూట్స్ వేస్తుంటారు. జీడిపప్పు, క్రిస్మిస్, యాలకులు, పిస్తా, బాదం, పంచదార తదితర రకాలు వేసి తయారుచేస్తారు. అందుకే ముస్లింలు చేసే ఖీర్ అంటే చాలా ఇష్టపడతారు. రంజాన్ రోజు ప్రతి ముస్లిం ఇంట ఖీర్, ఖుర్బానీ మిఠాయి ఉండాల్సిందే. ఈ వంటకంలో హిందూ, ముస్లింల ఐక్యత కనిపిస్తుంది. రంజాన్ రోజుల్లో పాల వినియోగం అధికంగా ఉంటుంది.

- కార్పొరేషన్ (కాకినాడ)







లూయిస్ బ్రెయిలీ నాణేలు

# ఈ నాణేలది ప్రత్యేక భాష!

### కంటి చూపు కోల్పోయినా ఆత్మస్థైర్యంతో ముందుకు..

### అంధుల కోసం ముద్రించిన నాణేల సేకరణలో ఈమె దిట్ట



రాచకొండ రాజేశ్వరి

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన రాచకొండ రాజేశ్వరి అరుదైన నేత్ర వ్యాధితో కంటి చూపును పూర్తిగా కోల్పోయింది. అప్పటివరకు అందరిలా సాగిన ఆమె జీవనం ఒక్కసారిగా మారిపోయింది. మొదట్లో మానసికంగా కొంత కుంగిపోయినా అంతలోనే తేరుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగింది. ఆమెకు అండగా ప్రముఖ నాణేల సేకరణ కర్త, భర్త పుత్సా కృష్ణకామేశ్వర్ తనవంతు సహాయ సహకారాలు ఆమెకు అందించారు. 2021 కరోనా సమయంలో అరుదైన నేత్ర వ్యాధి రాజేశ్వరికి సోకడంతో ఆమె పూర్తిగా దృష్టిని కోల్పోయింది. ఆమెకు మానసిక ధైర్యాన్ని నింపడంతో అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షురాలిగా పనిచేయడంతోపాటు కోనసీమ మహిళా క్లబ్ నుంచి 2023లో జరిగిన మహిళా దినోత్సవంలో మహిళా అచీవర్ అవార్డును సైతం దక్కించుకున్నారు. మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్‌ను అంతర్జాతీయ స్థాయిలో బెస్ట్‌క్లబ్‌గా నిలిపిన ఘనత రాజేశ్వరికి దక్కుతుంది. ఆ సమయంలోనే ఆమె అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ నాణేలను సేకరించడం ప్రారంభించారు. దేశంలో ఇప్పటి వరకు విడుదలైన రూ.2, రూ.100 బ్రెయిలీ నాణేలతో పాటు బెల్జియం, ఇటలీ దేశాలు విడుదల చేసిన ద్విలోహ నాణేలు, బ్రెయిలీ ముఖ చిత్రంతో విడుదల చేసిన వెండి నాణెం, పలావ్, అమెరికా దేశాలు 2009లో విడుదల చేసిన వెండి నాణేలు, పోలెండ్ దేశం విడుదల చేసిన వెండి నాణేలను సైతం ఆమె సేకరించారు. బ్రెయిలీ నాణేలతో త్వరలోనే ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు రాజేశ్వరి తెలిపారు.

### సామర్లకోట భీమేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల

# ఆదాయం రూ.29.66 లక్షలు

సామర్లకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి మహా శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.29.66 లక్షలు వచ్చిందని ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్ సమక్షంలో గురువారం తెరిచి లెక్కించారు. హుండీల ద్వారా రూ.16,15,788, దర్శన టిక్కెట్ల ద్వారా రూ.7,05,960, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,12,696, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,66,215, వివిధ సేవా టిక్కెట్ల ద్వారా రూ.65,747 లభించాయి. 67 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల వెండి వస్తువులు లభించినట్టు ఈవో తెలిపారు. లెక్కింపులో ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఉండూరు శ్రీలక్ష్మీనారాయణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన సొమ్మును చూస్తున్న దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్

### 23, 24, 25 తేదీల్లో ఉదయ్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

సామర్లకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధిలో సామర్లకోట-రావికంపాడు మధ్య ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 23, 24, 25 తేదీల్లో సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం కార్యాలయం నుంచి గురువారం రాత్రి ఉత్తర్వులు అందాయి. 23, 24 తేదీల్లో గుంటూరు నుంచి విశాఖ వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను, 24, 25 తేదీల్లో విశాఖ నుంచి గుంటూరు వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. 22701, 22702 నంబర్లతో గుంటూరు-విశాఖ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24న రెండువైపులా తాత్కాలికంగా రద్దు చేశారు.



# వాసు ది గ్రేట్

### ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ఫలితాల్లో జాతీయ స్థాయిలో పదో ర్యాంకు కైవసం

అమలాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన పిచ్చిక కుమార్‌వాసు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)-2025 ఫలితాల్లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పదో ర్యాంకు సాధించాడు. చేనేత కార్మికులైన పిచ్చిక మల్లేశ్వరరావు-రేణుకవాణి కుమారుడు వాసు ఎంతో కష్టపడి గేట్ పరీక్ష రెండో పర్యాయం రాసి పదో ర్యాంకు సాధించాడు. దాంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. వారిని శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఊరేగించి వీరభద్రస్వామి ఆలయం వద్ద ఘనంగా సన్మానించారు. స్థానికులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, గ్రామ పెద్దలు ఉప్పుగంటి భాస్కరరావు, బళ్ల వెంకటేశ్వరరావు, బోళ్ల మల్లేశ్వరరావు, కారుపర్తి భాస్కరరావు, చందన శంకరరావు, మాడా పద్మదుర్గాప్రసాద్, లక్కింశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాసు తల్లిదండ్రులు మల్లేశ్వరరావు-వాణిలను సత్కరిస్తున్న బండారులంక గ్రామస్తులు

#### డీఆర్డీవోలో సైంటిస్ట్‌గా పనిచేయడమే లక్ష్యం
పిచ్చిక కుమార్‌వాసు

జాతీయ స్థాయిలో గేట్ పరీక్షలో పదో ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. 1 నుంచి 4వ తరగతి వరకు బండారులంక విజ్‌డమ్ స్కూలులో చదివాను. ఆ తర్వాత భూపతిపాలెం గురుకుల పాఠశాలలో చేరాను. రాజమహేంద్రవరం శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్, నర్సరావుపేట జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశారు. మూడేళ్లపాటు హైదరాబాద్‌లో ఇన్ఫోర్ కంపెనీలో బిజినెస్ ఎనలిస్ట్‌గా పని చేశాను. తర్వాత తమిళనాడులోని ఎన్‌సీఎల్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేరా. ప్రస్తుతం ఆగ్రాలోని ఇండియన్ ఆయిల్ కంపెనీలో ఏవియేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నా. గత ఏడాది గేట్ పరీక్షలో 285వ ర్యాంకు రాగా ఇండియన్ ఆయిల్ కంపెనీలో చేరాను. ఈసారి డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో)లో సైంటిస్ట్‌గా పనిచేయడమే లక్ష్యంగా గేట్ పరీక్ష రాశా. పదో ర్యాంకు రావడంతో సైంటిస్ట్‌గా చేరేందుకు మార్గం సుగమం అయ్యింది. నా అభ్యున్నతికి పాటుపడిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు.

### ఉగ్రవాదుల నుంచి రక్షణ... పారిశ్రామిక భద్రతకు

# సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సైక్లోథాన్ ర్యాలీ



సైక్లోథాన్ ర్యాలీ ప్రతినిధుల బృందానికి మెమెంటో అందజేస్తున్న డీఆర్వో రాజకుమారి

అమలాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించడంతో పాటు పారిశ్రామిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు (సీఐఎస్ఎఫ్) సైక్లోథాన్ ర్యాలీ చేపట్టాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎం రాజకుమారి పేర్కొన్నారు. దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడుతూ రక్షణ చర్యలపై సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. అమలాపురం పట్టణానికి చేరుకున్న సైక్లోథాన్ ర్యాలీని గురువారం ఉదయం గడియార స్తంభం సెంటర్లో జెండా ఊపి పునః ప్రారంభించారు. ర్యాలీ నర్సాపురం మీదుగా మచిలీపట్నం చేరుకుంటుందన్నారు. గుజరాత్ నుంచి చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ కన్యాకుమారి వరకు సాగుతుందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉగ్రవాదుల చర్యలను దీటుగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు బృందాలుగా సుమారు తీర ప్రాంతం వెంబడి 6,550 కిలోమీటర్ల మేర సైక్లోథాన్ యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. అదనపు ఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ దేశ పారిశ్రామిక రక్షణ, ప్రజల రక్షణకు ఈ ర్యాలీ తోడ్పడుతుందన్నారు. గుజరాత్‌లో ఈ నెల 7న కేంద్ర రక్షణ మంత్రి అమిత్‌షా సైక్లోథాన్ ర్యాలీని ప్రారంభించారన్నారు. నెలాఖరునాటికి కన్యాకుమారి చేరుకుటుందన్నారు. బృంద సభ్యులకు మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో దళ డిప్యూటీ కమాండర్ ఏకే ప్రభాకర్, తహసీల్దారు పలివెల అశోక్‌ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు పాల్గొన్నారు.



# మండే ఎండలో చలచల్లగా...

కరప, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వాకాడ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లేలేత చిగుర్లు తొడిగిన వృక్షాలు ప్రధాన రహదారిని పచ్చదనంతో ఆవరించి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఈ రహదారి వెంబడి ఉన్న చెట్ల నీడలో ప్రయాణికులు కొద్దిసేపు బడలిక తీర్చుకుని వెళ్తున్నారు. ఎండలు ముదురుతున్న తరుణంలో ఈ రహదారిపై ప్రయాణం ఆహ్లాదభరితంగా ఉంటోందని పలువురు ప్రయాణికులు చెప్తున్నారు.





కరప-వాకాడ ప్రధాన రహదారిపై పరుచుకున్న పచ్చదనం

# కాటేజీలు.. ఇక పరిశుభ్రంగా..

● సత్యదేవుడి సన్నిధిలో సత్రం గదుల నిర్వహణపై ఈవో దృష్టి

● మరమ్మతులు, పారిశుధ్య బాధ్యతలు ఏఈఈవోలకు అప్పగింత

● ఒక్కో సత్రానికి ఒక్కొక్కరి చొప్పున విభజన



ప్రకాష్‌సదన్ కాటేజీ

అన్నవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో భక్తులు బస చేసేందుకు వివిధ సత్రం గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చాలావరకు దశాబ్దాల క్రితం నిర్మించినవే. కొండపైన న్యూసెంటినరీ, పాతసెంటినరీ, సీతారామ, హరిహరసదన్, శివసదన్ పేర్లతో 450 గదులు ఉంటాయి. శివసదన్ ఒక్కటే రెండేళ్లక్రితం ప్రారంభించారు. మిగిలిన సత్రం గదుల్లో పలు గదులు మరమ్మతులకు గురవడం, శానిటేషన్ సంతృప్తికరంగా లేకపోవడంతో భక్తుల నుంచి విమర్శలు వినిపించేవి. శానిటేషన్, స్వల్ప మర మ్మతుల నిర్వహణ ప్రైవేట్ సంస్థకు టెండర్‌ద్వారా కేటాయించి శానిటేషన్ బాధ్యతలు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే కేటాయించేవారు.

### బాధ్యతల అప్పగింత

తాజాగా సత్రం గదుల పారిశుధ్య నిర్వహణ, మరమ్మతుల పర్యవేక్షణకు దేవస్థానంలో ఉన్న ఏఈఈవోల్లో ఒక్కో సత్రం బాధ్యత ఒక్కో ఏఈఈవో కు అప్పగించారు. కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రం బాధ్యతలు సూపరింటెండెంట్ ఐవీ రామారావుకు అప్పగిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలిచ్చారు. వీరంతా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి గదులన్నీ భక్తులకు కేటాయించాలనే ల క్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్ప టికే కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రంలో ఐవీ రామారావు దృష్టిసారించి కాటేజీకి సంబంధించి ఎలక్ట్రికల్, ప్లంబింగ్, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. సత్రం గుమస్తాలు ఏ గదిలో మరమ్మతులు ఉన్నాయో చూసి సంబంధిత కాటేజీకి అప్పగించిన వారికి సమాచారం చేరవేస్తే ఆ ఏఈఈవో వాటిని త్వరితగతిన పని పూర్తి చేయిస్తారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూకరత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అన్ని కాటేజీల పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. దీంతో సత్యదేవుడి సన్నిధిలో ఉన్న సత్రం గదులకు మహర్దశ పట్టి గదులన్నీ పూర్తి సౌకర్యాలతో నిండి ఉంటాయని అనడంలో సందేహం లేదు.

నేడు సత్యదేవుడి నూతన ఆలయ నిర్మాణ..

## పునఃప్రారంభ దినోత్సవం

● అన్నవరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్న పండితులు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి నూతన ఆలయ నిర్మాణం పునః ప్రారంభించి శుక్రవారంతో 13ఏళ్లు పూర్తిచేసుకుని 14వఏట ప్రవేశించబోతోంది. శిథిలావస్థకు చేరిన పాత ఆలయంలో మూలవిరాట్‌లను కదపకుండా పూర్తిగా గ్రానైట్‌తో అప్పటి ఈవో, ప్రస్తుత దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ కృషితో సాధ్యమైంది. ఈ విషయంలో పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించి గుడి పునర్నిర్మాణం నిలుపుదల చేయాలని ఎత్తులు వేశారు. దీనిపై రామచంద్రమోహన్ అలుపెరగని పోరాటం చేశారు. 2010లో పాత ఆలయ గోడలు తొలగించి యంత్రాలయం ఆవరణలో బాలాలయం నిర్మించి స్వామికి ఉన్న శక్తినంతటనీ మంత్రపూర్వకంగా కలశాల్లో నింపి భక్తుల దర్శనాలకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించారు. 2012లో ఫాల్గుణ బహుళ సప్తమి రోజున కంచికామకోటి పీఠాధిపతి కలశప్రతిష్ఠ గావించారు. అప్పట్నించి ప్రతిఏటా ఫాల్గుణ బహుళ సప్తమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గర్భాలయంలో ఉన్న మూలవరులకు లక్షపత్రిపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు అవసర నివేదనలు శాస్త్రోక్తంగా చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకట నారాయణ, ఎస్ఐలు

# అప్పులబాధ తాళలేకే..

» పిల్లలను చంపి తాను ఆత్మహత్యకు పథకం...

» మనస్సుమార్చుకుని రాథేయపాలెం బంధువుల ఇంటికి

» బంధువుల సూచనతో పోలీసుల ఎదుట లొంగుబాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గణపతినగరంవద్ద తన కన్నబిడ్డలను కాలువలోకి తోసి కుమార్తె కారుణ్యశ్రీ (7) మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ పిల్లి రాజును అరెస్టు చేశారు. గురువారం రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వెల్లడించారు. రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు అప్పుల బాధతాళలేక తన కుమారుడు రామ్‌సందీప్(10), కుమార్తె కారుణ్యశ్రీ(7)లను చంపి తాను ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు. ఈనెల 17న మధ్యాహ్నం ఒంటిగంటకు తన పిల్లలు చదువుతున్న భాష్యం పాఠశాల నుంచి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని నెలపర్తిపాడు శివారు గణపతినగరంవద్ద ఇంజరం కాలువలోకి ఇద్దరు పిల్లలను తోసేశాడు. కుమారుడు ఈదుకుంటూ తుప్పలను పట్టుకుని ఒడ్డుకుచేరుకోగా కుమార్తె కారుణ్యశ్రీ కాలువలో మునిగి మరణించింది. పిల్లి రాజు తన మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. కుమారుడు ఇచ్చిన సమాచారంతో ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదుచేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిల్లి రాజు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. బుధవారం రాజు మోటారు సైకిల్ యానాం వారధిపై గుర్తించడంతో గోదావరిలో కూడా గాలింపు చర్యలు చేపట్టారు. పిల్లి రాజు ఆత్మహత్య చేసుకోవాలని యానాం చేరుకున్నాడు. అనంతరం మనస్సు మార్చుకుని రాజానగరం మండలం రాథేయపాలెం బంధువుల ఇంటికి చేరుకున్నాడు. బంధువుల సూచనతో మండపేటరూరల్ పోలీసులకు పిల్లి రాజు లొంగిపోయాడు. ద్రాక్షారామ పోలీసులు రాజును అరెస్టుచేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ ఎం.వెంకటనారాయణ, ద్రాక్షారామ, రామచంద్రపురం ఎస్ఐలు లక్ష్మణ్, నాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో జనసేన వీర మహిళపై కేసు నమోదు

పిఠాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేతతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్యనేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పిఠాపురం పట్టణానికి చెందిన జనసేన వీరమహిళ సుజాతపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడ శివారులో ఈనెల 14న జనసేన ఆవిర్భావ సభ జరిగిన తీరుపై ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులనుద్దేశించి సుజాత అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో పోస్టుచేసింది. జ్యోతిప్రజ్వలనకు కొందరినే ఆహ్వానించడం తదితర అంశాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో రెండు రోజుల క్రితం జనసేన నాయకులు పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం కేసునమోదు చేసిన పిఠాపురం పట్టణ పోలీసులు రాత్రి సుజాత ఇంటికి వెళ్లారు. రాత్రి కావడంతో స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లిపోయారు. ఇప్పటివరకు ఆమెను అరెస్టుచేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనసేన నాయకులు మరోమారు సీఐని కలిశారు.

## ఫిలిం డిస్ట్రిబ్యూటర్ రాము ఆకస్మిక మృతి



ఆకుల రాము

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా దశాబ్దాల కాలంగా వ్యవహరిస్తున్న ఆకుల రాము (62) గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందారు. సినిమా పంపిణీ రంగంలో ఎవరు ఏ సినిమా కొనాలన్నా ముందుగా రామును సంప్రదించేవారు. సినిమా రంగానికి రాము చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు. అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న మెట్ల కాలనీలో ఆయన నివాసంలోనే రాము గుండెపోటుతో మృతిచెందడంతో సినీ అభిమానులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ట్రాక్టర్ కింద పడి గిరిజనుడి మృతి

కూనవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కోతులగుట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కొంతమంది గిరిజనులు పోచవరం కాలనీ మిర్చికోతల పనులకు నెలరోజుల క్రితం వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో వారు ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్నారు. ఈలోగా కోతులగుట్టలో ట్రాక్టర్ టైరు పేలడంతో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న ముచ్చిక ఎర్ర(30) అకస్మాత్తుగా కింద పడిపోయారు. దీంతో ఎర్రపై నుంచి ట్రాక్టర్ చక్రాలు వెళ్లిపోవడంతో ఎర్ర అక్కడికక్కడే మృతిచెందాడు. అన్న సీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నాడు. మృతుడిది ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుకమాజిల్లా బాబినపల్లి గ్రామం.



# 23న రాజమహేంద్రవరంలో ప్రాంతీయ విద్యాసదస్సు

● ఏపీయూటీఎఫ్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



ఏపీయూటీఎఫ్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళా కేంద్రంలో ఈనెల 23న ఐదు జిల్లాల ప్రాంతీయ విద్యాసదస్సు జరుగుతుందని ఏపీయూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ వెల్లడించారు. గురువారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ హోంలో జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశానికి జయకర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పోరుబాటలో భాగంగా ప్రాంతీయ విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో తూర్పుగోదావరి జిల్లాతోపాటు పశ్చిమగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాల నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర యూటీఎఫ్ నాయకత్వం ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. యూటీఎఫ్ కార్యకర్తలు మండలస్థాయిలో సర్వే నిర్వహించి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ జీవో 117 రద్దు, పాఠశాలల విలీనాలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల రూ.25,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయగౌరి, ఈవీఎస్ఆర్ ప్రసాద్, శ్రీమణి, దయానిధి, శ్రీనివాస్, రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, శ్రీనివాసమూర్తి, వెంకటరమణ, సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

## హుండీల ఆదాయం రూ.25.32లక్షలు



అయినవిల్లి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 51 రోజులకుగాను ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.24,45,779 నగదు, అన్నప్రసాద హుండీ నుంచి రూ.86,484 నగదుతో కలిపి రూ.25.32లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 14 విదేశీ కరెన్సీ నోట్లు హుండీలో గుర్తించామన్నారు. దేవదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

## జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు నమోదు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్-బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. జీబీఎస్ బారిన పడిన ముగ్గురు బాధితులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్యకుమారి గురువారం తెలిపారు. జీబీఎస్ కేసులకు వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో అందు బాటులో ఉన్నాయని ఆమె చెప్పారు.

# వివాహేతర సంబంధం కోసం తండ్రినే మట్టుబెట్టింది!

● ప్రియుడితో కలసి హతమార్చిన కుమార్తె

● పోలీసుల దర్యాప్తులో వెల్లడైన దారుణం

● కుమార్తె సహా మరో ఇద్దరు అరెస్టు

● మండపేటలో ఘటన



తండ్రిని ప్రియుడితో కలిసి హత్యకు పాల్పడిన కుమార్తె ఆమె ప్రియుడిని అరెస్టుచేసిన మండపేట సీఐ సురేష్

మండపేట, మార్చి20 (ఆంధ్రజ్యోతి): తన వివాహేతర సంబంధానికి కన్నతండ్రి అడ్డుతగులుతున్నాడని, తండ్రినే ప్రియుడితో కలిసి కుమార్తె హత్యకు పాల్పడిన దారుణమిది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ సీఐ దారం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల అనుమానాస్పద స్థితిలో సురా రాంబాబు మరణించాడు. ఈ కేసును ఛేదించిన పోలీసులు చివరకు అతని కుమార్తె, ఆమె ప్రియుడు హత్య చేసినట్టు తేల్చారు. సూరా రాంబాబు కుమార్తె వస్త్రాల వెంకటదుర్గకు రామచంద్రపురం పట్టణం సమీపంలో ఉన్న కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సురేష్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై తండ్రి మందలించడంతో ఆమె తన తండ్రిపై కసిపెంచుకుంది. ఈనెల 16వ తేదీ రాత్రి తన పిల్లలను తల్లి వద్ద పడుకోబెట్టిన దుర్గ తన తండ్రి ఒంటరిగా పడుకున్నాడని తన ప్రియుడు ముమ్మిడివరపు సురేష్‌కు సమాచారం చెప్పింది. దీంతో అతడు తన స్నేహితుడు అదే గ్రామానికి చెందిన తాటికొండ నాగార్జునతో కలిసి మండపేటకు వచ్చి గాఢనిద్రలో ఉన్న రాంబాబు ఛాతీపై కూర్చుని పీకను లిమి చంపి పారిపోయారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల కోసం గాలిస్తుండగా రామచంద్రపురం నుంచి విశాఖకు పారిపోయేందుకు సిదమవుతున్న వారిని రామచంద్రపురంలో అదుపులోకి తీసుకుని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలియజేశారు. మండపేట పట్టణంలో ఈనెల 16న మేదరపేటకు చెందిన సురాపండు తన అన్నగారైన రాంబాబు అనుమానాస్పదంగా మరణించాడని పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదుమేరకు ఈ కేసును దర్యాప్తు చేసినట్టు పట్టణ సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలమేరకు రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ నేతృత్వంలో కేసును ఛేదించి గురువారం ఈ కేసులో ముగ్గురు నిందితులను ఆరెస్టుచేశామని తెలిపారు. కోర్టు రిమాండ్ విధించగా వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

# రైలు నుంచి జారిపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

● మృతురాలిది ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్



మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుభాష్ మితా దాస్

సామర్లకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తూ కిందికి జారిపడడంతో తలకు బలమైన గాయమై ఒడిసా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ మహిళా ఉద్యోగి దుర్మరణం పాలయిన సంఘటన గురువారం సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జి.మేడపాడు స్టేషన్‌వద్ద జరిగింది. ప్రమాద సమయంలో కొన ఊపిరితోఉన్న సదరు యువతిని రైల్వే ఉద్యోగులు గుర్తించి వెనుకనే సామర్లకోట వైపునకు వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు లో హుటాహుటిన తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు 108 వైద్య సిబ్బంది గుర్తించా రు. వివరాల్లోకి వెళితే ఒడిసా రాష్ట్రం కేంద్ర పా రా జనావళి, కలాస్‌పూర్‌కు చెందిన శిబా ప్రసాద్ దాస్ కుమార్తె అయిన సుభాష్ మితా దాస్ (25) బెంగళూరులోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు బుధవారం బెంగుళూరులో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ టిక్కెట్టు ద్వారా ప్రయాణించేందుకు రైలు ఎక్కింది. రైలు గురువారం సామర్లకోట సమీపాన జీ.మేడపాడు చేరేసరికి బోగీ తలుపువద్ద నిలుచుని ఉన్న మితాదాస్ ప్రమాదవశాత్తూ కిందికి తూలి పడింది. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందింది. బోగీలోఉన్న మితాదాస్ లగేజీని పలాసవద్ద రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహంవద్ద లభించిన ప్రాథమిక సమాచారంతో భువనేశ్వర్‌లో ఉన్న తండ్రికి సామర్లకోట రైల్వేపోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

● భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

● కోటనందూరులో ఘటన..



ట్రాక్టర్ చక్రాలకిందపడి మృతి చెందిన వెంకటేశ్వర్లు

కోటనందూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి-కాకరాపల్లి మార్గంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లిజిల్లా నాతవరం మండలం చినగొలుగుండపేటకు చెందిన కాళ్ల వెంకటేశ్వర్లు(59), బర్ల వరలక్ష్మి టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్ ద్విచక్రవాహ నంపై కోటనందూరులో సామాన్లు కొనుక్కోవడానికి వెళుతున్నారు. అదే దారిలో ధాన్యం లోడుతో అతివేగంగా వెళుతున్న గునిపూడికి చెందిన ట్రాక్టర్ పక్కనుంచి ఢీకొట్టడంతో వీళ్లిద్దరూ కింద పడిపోయారు. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా బర్లవరలక్ష్మికి తీవ్రగాయాల య్యాయి. ఆమెను 108 అంబులెన్స్‌లో నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

# బైక్ ప్రమాదంలో చిన్నారి మృతి



మృతి చెందిన చిన్నారి

మారేడుమిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి తీవ్రగాయాలు పాలయ్యాడు. ఈ సంఘటన మారేడుమిల్లి మండలం దేవరపల్లి సమీపంలో చోటుచేసుకుంది. రంపచోడవరం మండలం రాకోటకు చెందిన కామేశ్వరరెడ్డి తన కుటుంబంతో మారేడుమిల్లి మండలంలోని జీఎం వలస గ్రామానికి తన కుటుంబంతో కలిసి శుభకార్యానికి వెళ్లి వస్తుండగా దేవరపల్లి సమీపంలో ఒక మలుపువద్ద చెట్టును బలంగా ఢీ కొట్టాడు. దీంతో హంసగీత(4)అక్కడికక్కడే మృతి చెందగా మరో చిన్నారి నిఖిత వర్షిణి గాయాలపాలైంది.ఈప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కామేశ్వర రెడ్డిని రంపచోడవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న ఈవో సురేష్‌కుమార్

## కూనవరం రుద్రమ్మకోట రేవు వేలంపాట రూ.78.60లక్షలు

కూనవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కూనవ రం రుద్రమ్మకోట పడవ రేవు వేలంపాట రూ.78. 60లక్షలు పలికింది. వేలేరుపాడు మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన బీరబోయిన కోటేశ్వరరావు ఈపాటను దక్కించుకున్నారు. గత ఏడాది రూ.80లక్షలు పాట పలకగా ఈఏడాది రూ.78.60లక్షలు పలికింది. కూనవరం పంచాయతీ కార్యాలయంలో ఈ పాట నిర్వహించారు. ఈకార్యక్రమంలో కూనవరం, రుద్రమ్మకోట సర్పంచ్‌లు హేమంత్, లలితకుమారి, ఎంపీటీసీ అనంతలక్ష్మి, వైస్‌ఎంపీపీ బండారు సాంబశివరావు, ఎంపీడీవో రామాంజనేయప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో కువైట్‌లో గొందివాసి మృతి



కువైట్‌లో గుండెపోటుతో మృతిచెందిన చింతా సాగర్

అంతర్వేది, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన చింతా సాగర్(34), 18వ తేదీన కువైట్ దేశంలో గుండెపోటుతో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రెండు రోజులకు కువైట్ దేశం నుంచి సాగర్ పనిచేస్తున్న శేర్ ఫోన్‌చేసి వివరాలు తెలిపినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సాగర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. 2022లో కువైట్ దేశం వెళ్లిన సాగర్ 2024 జనవరిలో వచ్చి తిరిగి మళ్లీ జూలై నెలలో వెళ్లినట్టు తెలిపారు. జీవనోపాధి కోసం వెళ్లిన సాగర్ మరలా తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు సాగర్‌కు గుండెపోటు వచ్చిందన్న మరణవార్త విని ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కువైట్ దేశంలో డ్రైవింగ్ చేసుకుంటూ నిద్రమత్తులోనే గుండెపోటుతో మరణించిన సాగర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి వస్తుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కరప ఎస్ఐ తోటసునీత తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన సాధన(28)కు ఎనిమిదేళ్ల క్రితం కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామ శివారు వై.సావరానికి చెందిన కోరం రాజశేఖర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహమైనప్పటి నుంచీ రాజశేఖర్ సాధనను అనుమానిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ రాత్రి వారిద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త వేధింపులు భరించలేక సాధన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. అప్పటి నుంచీ కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారంరాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



## కొడవలిలో ఘనంగా ఇందేసమ్మ జాతర

గొల్లప్రోలు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం కొడవలిలో ఇందేసమ్మ తల్లి జాతర గురువారం వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆ పార్టీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## ఇలా ప్రయాణం.. చాలా ప్రమాదం?

ఏదైనా రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం జరిగితే ఎవరూ తిరిగి తీసుకురాలేరు. కానీ స్వీయ జాగ్రత్తలు పాటిస్తే కొంత నష్టాన్ని నివారించవచ్చు. కాకినాడ నగరంలో కొందరు ఇలా వాహనాపై పరిమితికి మంచి ప్రయాణిస్తూ కనిపించారు. వీటిపై ఆర్టీఏ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, కాకినాడ ఫొటోగ్రాఫర్





కళాశాలకు స్కూటీపై ముగ్గురు.. ముగ్గురుగా వెళ్తున్న విద్యార్థినులు



మోటారుసైకిల్‌పై నలుగురు



ఆటోలో పరిమితికి మంచి వెళ్తున్న ప్రయాణికులు



## రంజాన్ కానుకగా రేషన్ సరుకులు పంపిణీ

కాకినాడ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా కాకినాడ జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో గురువారం 500 మంది పేదలకు రంజాన్ కానుకగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎజాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభ్యులు షమ్ము జుబేర్, ఉబేదుల్లా, సలీంబాయి, తానీషా, అజ్జు, ఇంతియాజ్, బాషా, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## 'కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి'

కాకినాడ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. గురువారం ఇంద్రపాలెంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజశేఖరాన్ని ఘనంగా సత్కరించారు. సీతయ్యదొర, రామలింగేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ నిధులు



### కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.40 లక్షలు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడి బీసీ కాలనీలో అసంపూర్ణంగా ఉన్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనుల నిమిత్తం రూ.40 లక్షల చెక్కును జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి త్రినాథ్‌కి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ సుబ్రహ్మణ్యం గురువారం అందజేశారు. ఈ నిర్మాణంతో స్థానికులకు పలు శుభ కార్యక్రమాలకు వేలాది రూపాయల భారం తగ్గుతుందని చెప్పారు.



### యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ రూ.36లక్షలు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి పథకం, ఆరోగ్య ప్రమాణాలు పెంచడంలో భాగంగా సామాజిక బాధ్యత కింద గురువారం కలెక్టర్ షాన్ మోహన్‌కు యూనివర్సల్ బయోఫ్యూయల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ దుగ్గల్ రూ.36.85లక్షల చెక్కు అందజేశారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, ముఖ్య ప్రణాళికాధికారి త్రినాథ్, యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ జనరల్ మేనేజర్ వసంతరావు, కన్సల్టెంట్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

## కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల తోడ్పాటు, ఉద్యోగుల సమష్టి కృషి వల్లే ది కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సంస్థ వందేళ్లకు పైగా సమర్థవంతమైన సేవలు అందించగలుగుతోందని కేసీబీఎస్ చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. సినిమా రోడ్‌లోని కేవీకే రావు ఆడిటోరియంలో గురువారం కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేనేజర్ చీమలకొండ గంగాధరం అతిథులను వేదికపైకి ఆహ్వానించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనను సభ ముందుంచారు. ఆడిటర్ సభ్యుల ఆదాయపు పన్ను సందేహాలను నివృత్తి చేశారు. అధ్యక్షుడు కోసూరి మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

## విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం

గొల్లప్రోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. గురువారం ఉదయం 8 నుంచి రాత్రి 7గంటల వరకూ పలుమార్లు కరెంటు ఆగిపోయింది. శివాలయం వీధి, బస్టాపు తదితర ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మార్పు కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉండడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పలేదు.



## విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని విద్యుత్ రీడర్స్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్స్ రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుళాయిచెరువులోని విద్యుత్ కార్యాలయం వద్ద వారు ధర్నా చేశారు. తెలుగు తల్లి విగ్రహం నుంచి భారీ ర్యాలీగా బయల్దేరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన మాట నిలిబెట్టుకోవాలి అని నినాదాలు చేశారు. ఎస్ఈ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కాకినాడ డివిజన్‌కు చెందిన బీఎస్ రావు, జగ్గంపేట డివిజన్‌కు చెందిన నానాజీ మీడియాతో మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని చాలీచాలని పీస్ రేటు కమిషన్‌తో నెల మొత్తంలో 10రోజులకే ఉద్యోగాన్ని కుదించి పొట్టకొట్టారన్నారు. అంతేకాకుండా మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా ఈ ప్రభుత్వం పాతమీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమర్చి మరింత అన్యాయం చేస్తోందని వాపోయారు. నాయకులు వీరబాబు, రెడ్డి, మదీనా, కుమార్, నూకరాజు, రామకృష్ణ, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

## 'ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరాలి'

పిఠాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు చేరేలా చూడాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి ఆదేశించారు. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో గురువారం ఆమె గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలకు చెందిన వ్యవసాయ, ఇరిగేషన్, పశుసంవర్థక, ఉద్యానవన, పట్టుపరిశ్రమ, మత్స్య శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు, అవసరాలను పాడా కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఏపీడీ వసంతమాధవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న చైత్రవర్షిణి

## 91వసారి రక్తదానం

కరప, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 91వసారి రక్తదానం చేశారు. నడకుదురు గ్రామానికి చెందిన ఎ.రామయ్య విద్యుత్ షాక్‌కు గురై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి అత్యవసరంగా రక్తం అవసరం కాగా కుటుంబసభ్యులు తాతీలును సంప్రదించారు. సమయానికి దాతలు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తానే స్వయంగా కాకినాడ ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి అరుదైన ఓ పాజిటివ్ బ్లడ్‌ను డొనేట్ చేశారు. రక్తదానంతో పాటు ఎన్నో సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న తాతీలుకు పేషెంట్ బంధువులు, డాక్టర్ పెంటగట్ల మణికుమార్, బ్లడ్ ఆర్మీ సేవా సంస్థ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రత్నాకర్ దీక్ష

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ గురువారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం వర్గీకరణకు మద్దతు పలుకుతున్నారని విమర్శించారు. దీక్షకు పలువురు మాలమహానాడు కార్యకర్తలు మద్దతు పలికారు. రత్నాకర్ తన డిమాండ్లను కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. దీక్షలో ఉన్న రత్నాకర్‌ను కాకినాడ మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



## 'జీరో పావర్టీ-పీ4 సర్వేను సమర్థవంతంగా చేపట్టండి'

కొత్తపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047లో భాగంలో రాబోయే ఐదేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు జీరో పావర్టీ పీ-4 పాలసీ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని కొత్తపల్లి మండల సహాయ గణాంకుడు (ఏఎస్‌వో) బండి అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. వాకతిప్ప సచివాలయంలో సచివాలయ సిబ్బందికి, కార్యదర్శులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా అభివృద్ధికి, ప్రజల జీవన విధానానికి అవసరమైన అవరోధాలు, వాటి నివారణకు సలహాలు, సూచనలను పీ-4 సర్వేలో నమోదు చేయాలన్నారు.

## 'కాకినాడ బోటు బిల్డింగ్ యార్డును ప్రభుత్వమే నిర్వహించాలి'

కాకినాడ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా సబ్సిడీ చేప పిల్లల సరఫరా మరింతగా పెంచి ఇన్లాండ్ మత్స్యకారులకు దోహదపడేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు కోరారు. విజయవాడ పోరంకిలోని గల మత్స్య శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం 25వ ఆంధ్రప్రదేశ్ మత్స్య సహకార సంఘాల సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. మత్స్య శాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్ అధ్యక్షత వహించగా రంగారావు మాట్లాడుతూ కాకినాడలోని బోటు బిల్డింగ్ యార్డ్‌ను ప్రైవేట్ వ్యక్తుల నుంచి వెనక్కి తీసుకుని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా రంగారావును సత్కరించారు.

## 'చైల్డ్ సేఫ్ జిల్లాగా కాకినాడ'

గొల్లప్రోలు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ సేఫ్ జిల్లాగా కాకినాడను ప్రకటించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొని అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని మండల మహిళా సమాఖ్య భవనంలో గురువారం సెర్ప్ సిబ్బంది, ఏపీఎంలు, సీసీలు, గ్రామ సంఘం ప్రతినిధులు, వీవోఏలు, టీవోటీలకు శిక్షణ ఇచ్చారు. యుక్త వయసులో ఉన్న బాలబాలికలకు మంచి, చెడు స్పర్శలు, వ్యక్తిగత విద్య, భద్రతా నియమాలు, ఇంటర్నెట్ సేఫ్టీ, పోక్సో చట్టం తదితర అంశాలపై పడాల చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, బృంద సభ్యులు శిక్షణ ఇచ్చారు. డీఆర్డీఏ హెచ్‌డీ యాంకర్‌పర్సన్ జి.అనిల్‌కుమార్, ఏపీఎం ఆర్.సన్యాసిరావు, సీసీ రాజకుమారి, పేరయ్యనాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## కొరుపల్లి మాజీ సర్పంచ్‌కు జనసేన నేతల పరామర్శ

కరప, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పితృ వియోగంతో వున్న కొరుపల్లి మాజీ సర్పంచ్ రెడ్డి వీర వెంకట సత్యనారాయణను గురువారం జనసేన మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి పరామర్శించారు. అనంతరం గొడ్డటిపాలెంలో పర్యటించి జనసైనికుడు పల్ల ప్రసాద్, పితృ వియోగంతో వున్న విలేకరి పలివెల రమేష్‌లను పరామర్శించి సానుభూతి తెలిపారు. నాయకులు ముద్రగడ రమేష్, గంటా నానిబాబు, వీరంరెడ్డి ముత్యాలరావు, రెడ్డి లోవరాజు, గుబ్బల భవానీ, ఎ.నాని, వెంకటరమణ పరామర్శించిన వారిలో ఉన్నారు.



## 'బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి'

సామర్లకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఎంఈవో పట్టపగలు పుల్లయ్య కోరారు. బడి మానివేసిన ఇద్దరు విద్యార్థులను అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో తిరిగి చేర్పించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో పుల్లయ్య పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వంతెన పనుల పరిశీలన

గొల్లప్రోలు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ కాలువపై వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి ఆదేశించారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లేందుకు రూ.4కోట్ల వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను ఆమె గురువారం సాయంత్రం పరిశీలించారు. వేసవి పూర్తయ్యే నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు. మండలంలోని చేబ్రోలు పట్టుపరిశ్రమ కేంద్రంలో గల పట్టుగూళ్ల మార్కెట్‌ను పరిశీలించారు. అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పట్టు పురుగుల షెడ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పీడీ వెంట ఏపీడీ వసంతమాధవి, అధికారులు ఉన్నారు.

## హుండీల ఆదాయం రూ.1.38 లక్షలు

కాకినాడ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంద్రపాలెంలోని శ్రీమందేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లోని హుండీలను దేవదాయ శాఖ కాకినాడ డివిజన్ తనిఖీ అధికారి వడ్డి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. 100 రోజులకు రూ.1,38,697 వచ్చిందని ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. లెక్కింపులో గ్రేడ్-3 ఈవో డి.శ్రీనివాసరావు, అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మరిడమ్మకు జడ్జి పూజలు

పెద్దాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ అమ్మవారిని పిఠాపురం కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి గురువారం దర్శించుకున్నారు. ఆమెకు సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు.

## ఆరోగ్య అవగాహన సదస్సు

సర్పవరం జంక్షన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ శరీరానికి తగిన శ్రమ, వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్‌కి అలవాటుపడడంతో 30 ఏళ్లలోపే బీపీ, కీళ్ల నొప్పులు వంటి అనారోగ్య రుగ్మతలకు గురవుతున్నారన్నారు. తగిన పోషక విలువలున్న పీచు పదార్థాలు సమృద్ధిగా ఉండే వాటిని తీసుకోవాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### రైతులకు పోర్టల్ నమోదు తప్పనిసరి

గండేపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రైతులకు పోర్టల్ నమోదు తప్పనిసరని జగ్గంపేట సహాయ వ్యవసాయాధికారి ఇంటి గంగాధర్ అన్నారు. ఉప్పలపాడు గ్రామంలో గురువారం పోర్టల్ నమోదుపై రైతులకు గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా గంగాధర్ కుమార్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందాలంటే పోర్టల్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. దీని ద్వారా రైతుకు విశిష్ట నంబరు వస్తుందన్నారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## నాణ్యమైన విద్య అందించేందుకు
## కార్యకర్తలకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎటపాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల్లో ప్రీస్కూల్ విద్య నాణ్యతను మెరుగుపరిచేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ భి పడాయి భి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు సీడీపీవో విజయ గౌరి తెలిపారు. గురువారం ఎటపాక కేజీబీవీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్‌భి పడాయి భి కార్యక్రమంపై మూడురోజుల శిక్షణను ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచేందుకు కార్యకర్తలకు శిక్షణ దోహదపడుతుందన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 40 మంది కార్యకర్తల చొప్పున రెండు బ్యాచ్‌లకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, నవచేతన, మోడల్ గృహ సందర్శనలు, గ్రోత్ మానిటరింగ్, అభివృద్ధి డోమైన్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

## ఉచిత వైద్య శిబిరం

రాజవొమ్మంగి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాతంగి పంచాయతీ కొమరాపురం గ్రామ ంలో గురువారం ఏబీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త జి.శేషగిరిరావు ఆధ్వర్యంలో వైజాగ్ మెడికవర్ హాస్పిటల్ విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి వారిచే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీ పీ జుర్ర రాజేశ్వరి, జుర్ర జాను, జడ్డంగి సర్పం చ్ కొంగర మురళీకృష్ణ, అమినాబాద్ సర్పంచ్ కించు వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ చేదులూరి రాజబాబు, చేదులూరి అంజి బాబు, పోసిన అప్పారావు హాజరయ్యారు. 300 మందికి పైగా వైద్య సేవలు పొందారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంభానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

వీఆర్‌పురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబానికి వైసీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన సోలా నరసింహరావుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదానికి గు రై ఇంట్లోని సామాన్లు కొంత సొమ్ము కాలిపోవడంతో కట్టుబట్టలతో రోడ్డునపడ్డారు. విషయం తెలు సుకున్న వైసీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎనిమిది వేల రూపాయల నగదు, నిత్యావసర సరకులు బాధిత కుటుంబానికి అందించారు. మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

### 70 లీటర్ల సారా స్వాధీనం

దేవీపట్నం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాటుసారా స్థావరాలపై దేవీపట్నం ఎస్‌ఐ కె.షరీఫ్, సిబ్బంది మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఎస్.రామన్నపాలెం శివారులో 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. 100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

## 'ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలి'



రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కిరణ్‌కుమార్ తదితరులు

తొండంగి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలని జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శృంగవృక్షంలో గురువారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పెయ్యల సూర్యారావు, బూర్తి ఏలియా, చిట్టుమూరి బాలు, నేపా కృష్ణ, చెక్కా భీమరాజు, దుత్తరపు సత్తిబాబు పాల్గొన్నారు.

## 'అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి'

ఏలేశ్వరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతరిక్ష ప్రయోగాలు, కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. కోనేటి పాఠశాల ఆవరణలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సొర్నపూడి శ్రీనివాసరావు నేతృత్వంలో విద్యార్థులు వ్యోమగామి సునీత విలియమ్స్‌కు గురువారం శుభాకాంక్షలు తెలుపుతూ బాలికల పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. విద్యాశాకాధికారి అబ్బాయి, ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, అలమండ దుర్గా ప్రసాద్, విజయబాబు, రౌతు సహదేవుడు, బూర్లు సత్తిబాబు, ఎస్‌కే రేష్మ పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్, విద్యార్థులు



## జగ్గంపేటకు ఇరిగేషన్ నిధులు కేటాయించాలి

### ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గానికి ఇరిగేషన్ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అసెంబ్లీలో కోరారు. ఈ మేరకు గురువారం ఆయన శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు ద్వారా ఇరిగేషన్ మంత్రికి విన్నవించారు. గండేపల్లి మండలం తాళ్లూరువద్ద ఉన్న తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం పంపు హస్ ద్వారా రూ.35వేల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఆ పంపు హౌస్ ఐదేళ్లుగా పడకేసిందని, మరమ్మతులకు రూ.52కోట్లఅంచనాలతో నివేదికలు ఇచ్చామని తెలిపారు.

### రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

గండేపల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. గురువారం జేఈ ఉమా శంకర్‌తో కలిసి రూ.90లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టిన తాళ్లూరు నుంచి ఉప్పలపాడువెళ్లే రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈరోడ్డులో ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులు పడేవారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధ్వాన రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. సర్పంచ్ అడబాల ఆంజనేయులు పాల్గొన్నారు.

### 'సబిడ్సీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి'

జగ్గంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఇవ్వనున్న సబ్సిడీతో కూడిన రుణాలకు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

### ఉత్సాహంగా కలర్స్ డే

ప్రత్తిపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో ప్రతిభా విద్యాలయ ఆవరణలో గురువారం కలర్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుపు, ఎరుపు దుస్తులు, బెలూన్‌లతో సందడి చేసి కలర్స్ డే ప్రదర్శనలు ఇచ్చారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## 'ఆదిత్య'లో ముగిసిన అధ్యాపక అభివృద్ధి శిక్షణ



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న అధ్యాపక బృందం

గండేపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఐఐసీ -ఈడీసీ విభాగంలో ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అనే అంశంపై అతిథి ఉపన్యాసం ఘనంగా జరిగింది. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న స్టార్టప్ రంగంలో చక్కటి పరిజ్ఞానాన్ని కలిగి వ్యాపార అధికారి డాక్టర్ పావని కడియాల, ఆల్ ఇండియా రోబోటిక్స్ అంశాన్ని ఎంతో చక్కగా వివరించారు. ఆద్యంతం ఆచరణాత్మకంగా కొనసాగిన కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొని ఎన్నో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వివిధ విభాగాలకు చెందిన 50మంది అధ్యాపకులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ ప్రొచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈకార్యక్రమం కళాశాల అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ప్రొ వైస్‌చాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్, ఎస్.డీన్ ఈడీసీ జేడీ వెంకటేష్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో రోగులకు అన్నదానం



తుని రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆస్పత్రిలో శ్రీసరస్వతి విద్యా సేవాసమితి ఆధ్వర్యంలో రోగులకు అన్నదాన నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని జరిపించినట్లు సరస్వతి విద్యా సేవా సమితి అధ్యక్షుడు గొర్రెల శివరామకృష్ణ తెలిపారు.

### 'ఆదిత్య'లో జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

గండేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, యానాం, తూర్పుగోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -2025 నిర్వహించడానికి నోడల్ సంస్థగా ఆదిత్య యూనివర్శిటీని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఎంపిక చేసిన విజయం విదితమే. ఈనెల21,22 తేదీల్లో కాకినాడ, యానాం, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో 585 మంది పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకుని వీడియో అప్లోడ్ చేయడం ద్వారా 170 మందిని స్క్రీనింగ్ ద్వారా ఎంపిక చేసినట్లు యూనివర్శిటీ డిప్యూటీ ప్రొచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులు నాలుగు నిమిషాలు వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశంపై మాట్లాడాలి అని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్, ఈమెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆదిత్య యూనివర్శిటీలో నిర్వహించే పోటీల్లో ఉత్తమ స్పీకర్లను 10 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు. సమావేశంలో యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఎంబీ శ్రీనివాస్, వైస్ చాన్సలర్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ బి.సురేష్, డీన్ వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు, బి.రాంబాబు, ఐవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నెహ్రూ సహకారంతో సీఎం సహాయ నిధి చెక్కులను పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ గురువారం బాధితులకు అందజేశారు. జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామానికి చెందిన వనం దుర్గాప్రసాద్‌కి రూ.50వేలు, చీర నాగేశ్వరరావుకు రూ.61,049, సిరిపురం వీరవేనికి రూ.37,551 చెక్కులను బాధితులకు అందిం చారు. గండేపల్లి మండలం బొర్రంపాలేనికి చెందిన ఉమామహేశ్వరరావు వైద్యఖర్చుల నిమి త్తం సమకూర్చిన రూ.4.30లక్షల ఎల్‌వోసీ లేఖను అందించారు. పైడిపాపల సూరిబాబు, ముంద్రు ఎర్ర బాబు, సర్వసిద్ధ లక్ష్మణరావు, సింగరమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ తొట్టిపూడి నాగేశ్వరరావు, కనవరెడ్డి రామకృష్ణ, గండేపల్లి మాజీ జడ్పీటీసీ ఎర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబ్జి, పల్లపు సుబ్బారావు, సియాధుల పెద్దకాపు, గుమ్మళ్ల అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## మహాసేన రాజేష్‌కు పలువురి పరామర్శ



రాజేష్‌ను పరామర్శిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

ప్రత్తిపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పితృవియోగంతో బాధపడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేష్‌ను గురువారం పలువురు టీడీపీ నేతలు పరామర్శిం చారు. మండలంలోని ఉత్త రకంచిలో ఆయన ఇంటి వద్ద టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, పెనమలూరి ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ మంత్రి పీతల సుజాత పరామర్శించి సంతాపం తెలిపారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు కొల్లాబత్తుల అప్పారావు, బూరిగ ఆశీర్వాదం పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



తునిరూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ లలిత ప్రారంభించగా నిష్ణాతులైన కంటి వైద్యనిపుణులు కంటిపరీక్షలు చేపట్టారు. ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు పాల్గొనగా వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులతోపాటు కళ్లజోళ్లు అందజేశారు.

## అంగన్‌వాడీ సెంటర్లు ప్లే స్కూల్‌లా ఉండాలి



జగ్గంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లు ప్లే స్కూల్ మాదిరిగా కార్పొరేటర్ స్కూల్‌కు ధీటుగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గండేపల్లి, జగ్గంపేట మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో ఎంపీడీవో కార్యాలయంలో ఆయన సమావేశాన్ని జగ్గంపేట ఐసీడీఎస్ పీవో పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## కాలినడకన అన్నవరానికి యాత్ర



గండేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మురారి గ్రామానికి చెందిన కూటమి నాయకుడు జాస్తి వసంత్ గురువారం మురారి నుంచి అన్నవరం వరకు కాలి నడక యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ యాత్ర ప్రారంభించానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని పథకాలు వందశాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## బాటసారులకు మజ్జిగ పంపిణీ



ఏలేశ్వరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం నేతృత్వంలో బాటసారులకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డులో వేసవిని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ అందజేశారు. గోళ్ల నాగేశ్వరరావు, డీవీవీ సత్యనారాయణ, చిదంబరం, వరుపుల చిట్టిబాబు, తిరగటి సత్యనారాయణ, పెచ్చేటి కృష్ణ, రౌతు సహదేవుడు పాల్గొన్నారు.

### 'వినూత్న రీతిలో విద్యను బోధించాలి'

ఏలేశ్వరం, మార్చి20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న రీతిలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన నిర్వహించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో ఆధ్వర్యంలో వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

### స్టడీమెటీరియల్ అందజేత

రౌతులపూడి, మార్చి20(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి జడ్పీ పాఠశాల 22మంది ఏడో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటిరియల్‌ను రిటైర్డ్ ఎంపీడీవో రామశివాజీ ఉచితంగా అందజేశారు.

### శిక్షణా తరగతులు

తుని రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తుని ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులు శిక్షణ తరగతులు కె.శ్రీలత, ఏసీడీపీవో నిహారిక అధ్యక్షతన జరుగుతున్నాయి. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.